
సాక్షి
నల్లగొండ
ఆదివారం । 1 । జూన్ । 2025





**వృద్ధాప్యం.. ఉత్సాహం**
రిటైర్డ్ ఉద్యోగులు వీలుదొరికినప్పుడల్లా క్యారమ్స్, చెస్ ఆడుతూ సరదాగా, ఆనందంగా గడుపుతున్నారు. - 8లో



**నిలిచిపోయిన వాహనాలు**
పంతంగి టోల్‌ప్లాజాలో సాంకేతిక సమస్య వల్ల శనివారం ఉదయం అర్ధగంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. - 8లో

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం 40°/27°
పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

## ● థాయిలాండ్ భామకే కిరీటం



మిస్ వరల్డ్‌గా థాయిలాండ్ భామ ఎంపికైంది. గతకొన్ని రోజులుగా హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్న విషయం తెలిసిందే. శనివారం జరిగిన ఫైనల్ పోటీలో థాయిలాండ్ దేశానికి చెందిన ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ ఎంపికైంది. మిస్ వరల్డ్ కంటెస్టెంట్లతో కలిసి ఈమె గత నెల 12న నాగార్జునసాగర్‌కు వచ్చి సందడి చేసింది. ఆ దృశ్యమే ఇది.



నిడమనూరులో పొగాకు వ్యతిరేక ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

## పొగాకు ఉత్పత్తుల వాడకంతోనే క్యాన్సర్

నిడమనూరు : పొగాకు ఉత్పత్తుల వాడకంతో క్యాన్సర్ మరణాల సంఖ్య పెరిగిందని డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిడమనూరులో నో టుబాకో డే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులతో ఏటా 13 లక్షల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని పేర్కొన్నారు. పొగాకుకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేశవ, వైద్యాధికారులు కేవీ అరవింద్, రమ్య, సిబ్బంది సోమయ్య, జలీల్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ● వైభవంగా బోనాలు..



కనగల్ మండలం తేలకంటిగూడెంలో కంఠమహేశ్వర స్వామి-సూరమాంబదేవి విగ్రహాల ప్రతిష్ట ఉత్సవాల సందర్భంగా శనివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆలయం వద్దకు బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు - కనగల్

# ‘భూభారతి’కి అడుగులు

**3 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు**
- భూ సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ
- ఆగస్టు 15 నాటికి వాటిని పరిష్కరించేలా ప్రణాళిక
- సాదాబైనామాలకు కలగనున్న మోక్షం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : భూభారతి చట్టం అమలుకు అడుగులు పడుతున్నాయి. జూన్ 3వ తేదీ నుంచి జిల్లాలోని ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణిలో అనేక సమస్యలు పరిష్కారం కాక రైతులు ఇబ్బందులు పడ్డారన్న ఉద్దేశంతో ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది. అందులో భాగంగా ఇప్పటికే అన్ని జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని అక్కడ నెలకొన్న సమస్యలపై దరఖాస్తులను స్వీకరించిన విషయం తెలిసిందే. తాజాగా రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నుంచి భూభారతి చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు సిద్ధమైంది.

**ప్రతి మండలంలో రెండు బృందాలు**
ఈనెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళికను ఇప్పటికే సిద్ధం చేశారు. మండలాల వారీగా ఏరోజు ఏ గ్రామంలో సదస్సులు నిర్వహిస్తారనే వివరాలతో షెడ్యూల్‌ను రూపొందించి మండల అధికారులకు పంపారు. ప్రతి మండలంలో రెండు బృందాల ఆధ్వర్యంలో ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తారు. ఒక బృందానికి తాహసీల్దార్, మరో బృందానికి డిప్యూటీ తహసీల్దార్ టీం లీడర్లుగా వ్యవహరిస్తారు. ఆయా బృందాల్లో సర్వేయర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది ఉంటారు.



**సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ**
రెవెన్యూ సదస్సుల్లో ఆయా గ్రామాల్లోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుంది. ధరణిలో పరిష్కారం కాని సమస్యలను ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. వాటి ఆధారంగా దరఖాస్తు ఫారాలను కూడా సిద్ధం చేసింది. రైతులకు సదస్సుల్లో ఆ దరఖాస్తు ఫారాలను అందజేస్తే వాటిని నింపి అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. వాటితోపాటు ఇంకా పరిష్కారానికి నోచుకోని సమస్యలపై కూడా రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించనుంది.

**ఏరోజుకారోజు దరఖాస్తులపై నివేదిక**
గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించిన రోజే అధికారులు నివేదికలు ఇవ్వాల్సి ఉంటుంది. సదస్సు జరిగిన తరువాత ఆ గ్రామంలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి. అందులో ప్రభుత్వ భూమి, పట్టా భూమికి సంబంధించినవి ఎన్ని ఉన్నాయో లెక్కించి అందులో డివిజన్ల వారీగా, సమస్యల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలతో నివేదిక రూపొందించి కలెక్టర్‌కు అందజేస్తారు. కలెక్టర్ అదే రోజు ఆ నివేదికలను సీసీఎల్‌ఏకు పంపిస్తారు.

**25,430 సాదాబైనామా దరఖాస్తులు**
ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాదాబైనామాలకు భూభారతిలో మోక్షం లభించనుంది. ఉమ్మడి జిల్లాలో ఏడేళ్లుగా 25,430 సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ధరణిలో దానికి అవకాశం ఇవ్వకపోవడంతో సాదాబైనామాలపై భూములను కొనుగోలు చేసిన వారు ఇంతవరకు హక్కులను పొందలేదు. అలాంటి దరఖాస్తులు నల్లగొండ జిల్లాలో 13,080, సూర్యాపేట జిల్లాలో 8,564, యాదాద్రి జిల్లాలో 3,986 ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఎంతో కాలంగా రిజిస్ట్రేషన్ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న భూ యజమానులకు ఇందులో పరిష్కారం లభించనుంది.

**తహసీల్దార్లకు సిటిజన్ లాగిన్**
భూభారతి అమలులో భాగంగా ప్రభుత్వం తహసీల్దార్‌లకు సిటిజన్ లాగిన్ అవకాశం కల్పించింది. గ్రామసభలు పూర్తయిన తరువాత ప్రభుత్వ, పట్టాభూములకు సంబంధించిన సమస్యలు అన్నింటిని పరిశీలిస్తారు. అందులో తహసీల్దార్ పరిధిలో పరిష్కరించగలిగేవి, పరిష్కారానికి అనుకూలంగా లేనివి వేరు చేస్తారు. అలా చేసిన దరఖాస్తుల్లో పరిష్కారానికి అనుకూలంగా ఉన్న వాటిని తహసీల్దార్ తనకు ఇచ్చిన సిటిజన్ లాగిన్‌లో ఆ సమస్యలను పరిష్కరించి అప్‌లోడ్ చేస్తారు.

**ధరణిలో పరిష్కారం కాని సమస్యలు**
భూమి కొందరికి ఎక్కువగా.. తక్కువగా నమోదు కావడం, ఒకరి భూమి మరొకరి పేరున నమోదు కావడం, రైతులు భూములు నిషేధిత జాబితాలో పడటం, భూమి కొనుగోలు చేసినా పట్టా చేసుకునే పరిస్థితి లేకపోవడం, ప్రభుత్వ భూముల్లో ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వీలు లేకపోవడం తదితర అనేక సమస్యలు ఉన్నాయి. వాటికి తోడు సాదాబైనామాలు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. ప్రస్తుత సదస్సుల్లో అధికారులు ఇచ్చే దరఖాస్తు ఫారంలో రైతులు తాము ఎదుర్కొంటున్న ఈ సమస్యలన్నింటిని పేర్కొంటూ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

# రెవెన్యూ సదస్సులకు సిద్ధం కావాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : భూ భారతి చట్టం అమలులో భాగంగా ఈ నెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులకు అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో తహసీల్దార్లు, సర్వేయర్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టం–2025ను పకడ్బందీగా అమలు చేసేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. రెవెన్యూ సదస్సులపై ప్రచారం చేయాలన్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించే చోట టెంటు, కుర్చీలు, ఫ్లెక్సీలు,హెల్ప్ డెస్కులు, దరఖాస్తుల స్వీకరణ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. భూములకు సంబంధించిన అన్ని రిజిస్టర్‌లను వెంట తీసుకెళ్లాలని చెప్పారు. దరఖాస్తు స్వీకరించిన తర్వాత రశీదు ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్ ఇతర అంశాలపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఇస్తోందని.. తహసీల్దార్లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా 2వ తేదీన అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఆర్డీఓలు అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, నకిరేకల్ తహసిల్దార్ జమీర్ తదితరులు పాల్గొన్నారు.

**అవతరణ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి**
నల్లగొండ : రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 2న పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా అధికారులను ఆదేశించారు. అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై శనివారం ఆమె కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైతే రైన్ ప్రూఫ్ టెంటు వేయించాలన్నారు. వివిధ శాఖల అభివృద్ధిని తెలిపే విధంగా శకటాలను ప్రదర్శించాలని, స్టాల్స్ ఏర్పాటు చేయాలని, వైద్య ఆరోగ్య, ఫైర్, ఆర్‌అండ్‌బీ శాఖల ముఖ్యమైన సేవలు ప్రజలకు తెలిసే విధంగా ప్రదర్శించాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని డీఈఓను ఆదేశించారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ వేడుకల నిర్వహణలో భాగంగా అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ రాష్ట్రావతరణ దినోత్సవ వివరాలను, షెడ్యూల్‌ను వివరించారు. వేడుకలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

రామగిరి(నల్లగొండ) : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ మహిళలకు నెలరోజులు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ రఘుపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి, టెన్త్ పాసైన మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు నల్లగొండలోని రాంనగర్ ఎస్‌బీఐ కార్యాలయంలో జూన్ 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 97010 09265 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

### బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు దరఖాస్తులు

నల్లగొండ : జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఇంగ్లిష్ మీడియం 1వ తరగతి, (స్కాలర్‌షిప్), 5వ తరగతి (రెసిడెన్షియల్)లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారు రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతం వారు రూ.2 లక్షల ఆదాయ కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు ఇతర సర్టిఫికెట్లతో ఈ జూన్ 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌లో గానీ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో అవకాశం పొందిన కుటుంబాలు దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులని తెలిపారు.



కేతేపల్లిలో విత్తనాలు విత్తేందుకు అచ్చు తోలుతున్న రైతు



పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళలు

**సాగు పనుల్లో రైతన్న**
కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు వానాకాలం సాగుకు సిద్ధమయ్యారు. వారం రోజుల క్రితం కురిసిన తొలకరి వర్షాలకు దుక్కులు మెత్తగా దున్నుకున్న రైతులు శుక్రవారం కురిసిన వర్షంతో అచ్చులు తోటలం, పత్తి విత్తనాలు విత్తడం, వరినార్లు పోయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది ముందుగానే వర్షాలు పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. -కేతేపల్లి

# బనకచర్ల అనుసంధానం వద్దు

● ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న సత్యం

మునుగోడు : తెలంగాణ రాష్ట్రానికి గోదావరి జలాలు దక్కకుండా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు బనకచర్ల అనుసంధానం చేస్తామని ప్రకటించడాన్ని వెనక్కి తీసుకోవాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శనివారం మునుగోడులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత కాలంగా గోదావరి నదీజలాలపై వివాదం నడుస్తున్న సమయంలో బనకచర్ల అనుసంధానం సరైయింది కాదన్నారు. బచావత్ ట్రిబ్యునల్ 1980 ఒప్పందం, 2014 రాష్ట్ర విభజన చట్టం నిబంధనల మేరకు కేంద్రం జోక్యం చేసుకొని బనకచర్ల ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు బీజేపీకి మద్దతు ఉన్నంత మాత్రాన గత ఒప్పందాలకు వ్యతిరేకంగా వ్యవహరించడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు అంజయ్యచారి, గుర్జ రామచంద్రం, ఎన్.రామలింగయ్య, టి.వెంకటేశ్వర్లు, బి.నర్సింహ, చాపల శ్రీను, భాస్కర్, రమేష్, భిక్షం, శేఖర్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్లు సులభతరం!

**వ్యవసాయేతర భూములకు స్లాట్ బుకింగ్ విధానం**
- వీలున్న రోజు, అనుకున్న సమయానికి రిజిస్ట్రేషన్
- రిజిస్ట్రేషన్ అయిన గంటలోనే చేతికందనున్న డాక్యుమెంట్లు
- ఒక్కో సబ్ రిజిస్ట్రార్‌కు రోజుకు 48 స్లాట్ల కేటాయింపు
- రేపటి నుంచి అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు



నల్లగొండ : వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు ఇక సులభతరం కానున్నాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి తెస్తోంది. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద ఉమ్మడి జిల్లాలోని యాదగిరిగుట్ట, బీబీనగర్, చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమలు చేస్తోంది. అక్కడ ఎదురైన సమస్యలు పరిష్కరించుకుంటూ సోమవారం (జూన్2) నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ అమలు చేయనుంది. ఇందుకు కార్యాలయాల్లోనే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విధానం అమలైతే అనుకున్న రోజు, వీలున్న సమయానికి పది నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కలగనుంది.

**వేచి ఉండాల్సిన అవసరం లేదు..**
ఆస్తి రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ఇప్పటి వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి డాక్యుమెంట్ రైటర్‌ను సంప్రదించి.. రోజంతా కార్యాలయం వద్ద వేచి ఉండాల్సి వచ్చేంది. కొత్తగా తీసుకొస్తున్న స్లాట్ బుకింగ్ విధానం ద్వారా అన్ని డాక్యుమెంట్లను కొనుగోలుదారుడు తయారు చేసుకుని నెట్ బ్యాంకింగ్ ద్వారా భూమి విలువ ప్రకారం స్టాంప్ డ్యూటీ చెల్లించి.. తాను అనుకున్న రోజు రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. కార్యాలయంలో వేచి ఉండకుండా.. పది నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.

**రోజుకు 48 స్లాట్‌లు..**
ఒక్కో సబ్ రిజిస్ట్రార్‌కు రోజూ 48 స్లాట్లు కేటాయించనున్నారు. వారు రోజూ 48 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసేందుకు అవకాశం ఉంటుంది. అత్యవసరమైతే సాయంత్రం వేళల్లో స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు పూర్తయిన తర్వాత మరో ఐదు రిజిస్ట్రేషన్లు నేరుగా చేసేందుకు కూడా అవకాశం కల్పించారు. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉంటే ఒకొక్కరికి 48 చొప్పున 96 రిజిస్ట్రేషన్లు చేసేందుకు అవకాశం కల్పించారు. ప్రస్తుతం నల్లగొండలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లుండగా ఉండగా.. అత్యధికంగా రిజిస్ట్రేషన్లు అవుతున్న సూర్యాపేట, యాదగిరిగుట్టలో కూడా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లను నియమించారు.

**గంటలోనే డాక్యుమెంట్లు**
గతంలో రిజిస్ట్రేషన్ అయిన తర్వాత డాక్యుమెంట్ల కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ.. స్లాట్ బుకింగ్ విధానం ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తయిన గంటలోనే దస్తావేజులను ఇవ్వనున్నారు. ఇక మ్యూటేషన్ కోసం గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలకు కూడా వెళ్లాల్సిన అవసరం లేదు. ఇక్కడే మ్యూటేషన్ కూడా పూర్తవుతుంది.

**10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్**
> స్లాట్ బుకింగ్ విధానం ద్వారా 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ చేసి డాక్యుమెంట్లను స్కానింగ్ ప్రక్రియ పూర్తి చేసి కొనుగోలుదారులకు దస్తావేజులు అందిస్తాం. ఈ విధానం ద్వారా కొనుగోలుదారుడు అనుకున్న రోజు అనుకున్న సమయానికి రిజిస్ట్రేషన్ అవడంతో పాటు డాక్యుమెంట్లు చేతికి అందనున్నాయి.
> – ప్రవీణ్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్

## అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

రామగిరి(నల్లగొండ) : పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదర్శన కోసం జూన్ 9వ తేదీ సాయంత్రం 5.00 గంటలకు రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రీజినల్ మేనేజర్ కె.జానిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రద్దీని బట్టి ప్రత్యేక సర్వీసులు నడిపిస్తామని, అరుణాచలం వెళ్లే భక్తులకు ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం, తమిళనాడులోని వేలూరు గోల్డెన్ టెంపుల్ దర్శనం కూడా ఉంటుందని తెలిపారు. వివరాలకు 9298008888 ఫోన్ నంబర్‌ను, అన్ని సమీప బస్‌స్టేషన్లలో సంప్రదించాలని సూచించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నకిరేకల్ : రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నకిరేకల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ పాలక వర్గాల గడువు ముగిసి ఏడాదిన్నర గడుస్తున్నా ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించక పోవడంతో గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రాక గ్రామాల్లో అభివృద్ధి కుటుంపడిందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతకు ముందు ఇటీవల అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీలను ఆయన పరామర్శించారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి రాచకొండ వెంకట్, వంటిపాక వెంకటేశ్వర్లు, చెన్నబోయిన నాగమణి, ఇందిర, కృష్ణ, అంజయ్య, లక్ష్మి, అంజయ్య, పరమేష్, ఎల్లయ్య పాల్గొన్నారు.

## సగటున 7.9 మి.మీ వర్షపాతం నమోదు

రామగిరి(నల్లగొండ) : నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల నల్లగొండ జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు 7.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం ఇలా ఉంది.. కట్టంగూర్ 1.0 మి.మీ, శాలిగౌరారం 7.6, నార్కట్‌పల్లి 10.5, కేతేపల్లి 15.6, తిప్పర్తి 9.3, నల్లగొండ 28.6, కనగల్ 9.9, గుర్రంపోడ్ 11.7, అనుముల 33.1, నిడమనూరు 42.8, త్రిపురారం 17.0, మాడ్గులపల్లి 9.3, వేములపల్లి 10.0, మిర్యాలగూడ 1.5, దామరచర్ల 1.9, అడవిదేవులపల్లి 23.0, తిరుమలగిరి (సాగర్) 13.9, పెద్దవూర 2.2, గుండ్లపల్లి 0.2 నిడమనూరులో అత్యధికంగా 42.8 మి.మీ, గుండ్లపల్లిలో అత్యల్పంగా 0.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

## క్లుప్తంగా

### స్వచ్ఛంద సంస్థలతో పరిశుభ్రత చేపట్టాలి

● యాదగిరిగుట్ట ఈఓ వెంకట్రావ్



ఆలయ మాడ వీధుల్లో భక్తులతో మాట్లాడుతున్న ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు సంబంధించి స్వచ్ఛంద సంస్థలతో మాట్లాడి పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని ఈఓ వెంకట్రావ్ సంబంధిత ఉద్యోగులకు సూచనలు చేశారు. శనివారం రాత్రి ఆయన ఆలయ పరిసరాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలు, మాడ వీధులు అపరిశుభ్రంగా ఉండటంతో శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శానిటేషన్ కాంట్రాక్ట్‌కు సంబంధించిన మ్యాన్‌పవర్ ద్వారా శుభ్రపరిచే పద్ధతిన కేటాయించుటకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రతకు సంబంధించి ఆలయ పరిసరాలు, ఆయా ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతపై భక్తుల ద్వారా అభిప్రాయాలు తీసుకున్నారు.

### అనారోగ్యంతో బాధపడుతూ బలవన్మరణం

తిప్పర్తి: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తిప్పర్తి మండలం కంకణాలపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. తిప్పర్తి ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. కంకణాలపల్లి గ్రామానికి చెందిన గంటెకంపు క్రిష్ణయ్య (42) కొంతకాలంగాగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెందిన అతడు శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### తప్పిపోయిన బాలుడు కుటుంబ సభ్యుల చెంతకు..



హోంగార్డు శ్రీశైలంతో బాలుడు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్టకు శనివారం కుటుంబ సభ్యులతో వచ్చిన ఓ బాలుడు కొండపైన తప్పిపోయాడు. ఎస్‌పీఎఫ్ ఎస్ఐ అనిల్, ఏఎస్ఐ రాజయ్య, హోంగార్డు శ్రీశైలం చెప్పిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా అంజలిపురానికి చెందిన రఘువీరారెడ్డి తన తల్లి సీత, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి యాదగిరీశుడిని దర్శించుకునేందుకు వచ్చాడు. సాయంత్రం సమయంలో భక్తులు అధికంగా ఉండటంతో దర్శనానికి వెళ్తూ తప్పిపోయాడు. ఆలయ పరిసరాల్లో ఏడుస్తూ కనిపించిన రఘువీరారెడ్డిని అక్కడే విధులు నిర్వహిస్తున్న హోంగార్డు శ్రీశైలం గుర్తించి, ఆలయ విచారణ కార్యాలయం వద్ద మైక్ అనౌన్స్‌మెంట్ చేయించి, బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# వృద్ధాప్యం.. ఉత్సాహం

వారంతా జీవితాన్ని కాచివడపోసిన అనుభవజ్ఞులు. ఆరుపదుల వయస్సు దాటడంతో కృష్ణా.. రామా.. అని ఇంట్లో కూర్చోవాలనే పాత నానుడిని పక్కన పెట్టి జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు. నిత్యం ఆటపాటలతో, చర్చాగోష్టులతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతున్నారు. ఉద్యోగాల నుంచి రిటైర్డ్ అయినప్పటికీ శరీరానికే వయస్సు.. మనస్సుకు కాదంటూ తగ్గేదేలేదంటున్నారు. కష్టసుఖాలు, ఆరోగ్య సూత్రాలు, అనారోగ్య సమస్యలు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఇలా రిటైర్డ్ ఉద్యోగుల ఆటవిడుపునకు వేదికయ్యాయి నల్లగొండ, కోదాడలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనాలు.

– నల్లగొండ టూటౌన్, కోదాడ

నల్లగొండ పట్టణంలో దాదాపు 7700 వరకు రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 3800 మంది వరకు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘంలో సభ్యత్వం తీసుకొని వారు చేసే కార్యక్రమాల్లో వీలైనప్పుడు భాగస్వాములవుతున్నారు. అదేవిధంగా 70 నుంచి 100 మంది వరకు ప్రతిరోజు జిల్లా పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న పెన్షనర్స్ భవన్‌కు వచ్చి కాలక్షేపం కోసం క్యారమ్స్, చెస్ ఆడుతూ సరదాగా గడుపుతున్నారు. అదేవిధంగా కోదాడ పట్టణంతో పాటు సమీప గ్రామాలకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్ కలిసి కోదాడ పట్టణంలోని నయానగర్‌లో విశ్రాంత ఉద్యోగుల భవనాన్ని నిర్మించుకున్నారు. దాదాపు 2500 మందికి ఇందులో సభ్యత్వం ఇచ్చారు. ఈ భవనంలో క్యారమ్స్, చెస్ వంటి ఆటలు ఆడుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. పలువురు రిటైర్డ్ ఉద్యోగులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ పాల్గొని సత్తా చాటారు.

### గాన కచేరి చేస్తూ.. నవ్వులు పూయిస్తూ..

రిటైర్డ్ ఉద్యోగులు సంఘం భవనాలకు చేరుకొని తమ అనారోగ్య సమస్యలపై చర్చించుకోవడం, కుటుంబ సభ్యుల నేపథ్యం తదితర సమాచారం పంచుకుంటున్నారు. పిల్లలు తమ వద్ద లేకున్నా రిటైర్డ్ ఉద్యోగుల్లో ఎవరి ఏ సమస్య వచ్చినా పది మంది వెళ్లి వారి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. పెన్షనర్స్ భవన్‌లో కచేరి చేస్తూ నవ్వులు పూయిస్తూ సరదాగా గడిపేస్తున్నారు. అప్పుడప్పుడు విహారయాత్రలకు కూడా వెళుతున్నారు.



నల్లగొండ పెన్షనర్ల భవన్‌లో చెస్ ఆడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు



పాట పాడుతున్న రిటైర్డ్ ఉద్యోగి

- ఆటపాటలకు వేదికగా మారిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనాలు
- క్యారమ్స్, చెస్ ఆడుతూ ప్రశాంత జీవితం గడుపుతున్న రిటైర్డ్ ఉద్యోగులు
- రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణింపు
- అప్పుడప్పుడు విహారయాత్రలు

సండే స్పెషల్

### సేవా కార్యక్రమాలు కూడా చేపడుతూ..

ఒక నెలలో వచ్చే రిటైర్డ్ ఉద్యోగులందరి జన్మదిన వేడుకలను ఆ నెలలో ఒకరోజు నిర్వహించి కేక్ కట్ చేయించి వారిని ఘనంగా సత్కరించే కార్యక్రమం చేపడుతున్నారు. అదేవిధంగా 10వ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు తమ వంతుగా నగదు ప్రోత్సాహకాలు ఇచ్చి సత్కరిస్తున్నారు. అనాథాశ్రమాలకు పాత దుస్తులు, నగదు సాయం చేసి తమ సేవాభావాన్ని కూడా చాటుకుంటున్నారు.

### ఆరోగ్యంపై ఎన్నో జాగ్రత్తలు

ఆటపాటలకే కాదు ఆరోగ్యానికి కూడా రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. హైదరాబాద్, వరంగల్ వంటి పెద్ద పెద్ద పట్టణాల నుంచి ప్రముఖ వైద్యులను పిలిపించుకొని విశ్రాంత ఉద్యోగుల భవనంలోనే వైద్య శిబిరాలను నిర్వహిస్తూ దూర ప్రాంతాలకు వెళ్లలేని వారికి అండగా నిలుస్తున్నారు. అంతేకాకుండా కుమారులు, కుమార్తెలు ఇతర దేశాల్లో ఉన్న వారికి ఈ విశ్రాంత భవనాలే ఒంటరితనాన్ని దూరం చేస్తూ ఆనందంగా, ఉల్లాసంగా జీవించడానికి దోహదపడుతున్నాయి.

### మనుసు ప్రశాంతంగా ఉంటుంది



ఇంట్లో ఉండి టీవీ చూసి గడిపే కంటే పెన్షనర్లం అంతా ఒకచోటుకు వచ్చి నచ్చిన ఆటలు ఆడితే మనసు ప్రశాంతంగా ఉంటుంది. సెల్‌ఫోన్లు చూసినా అనారోగ్య సమస్యలు ఎక్కువయ్యే అవకాశం ఉంది. మాలో మేము కబుర్లు చెప్పుకుంటూ ఉంటే సమయమే తెలియదు.

– యాద వాసుదేవ్, రిటైర్డ్ ఉద్యోగుల నల్లగొండ పట్టణ కార్యదర్శి

### కబుర్లు చెప్పకుంటూ కాలక్షేపం



క్యారమ్స్, చెస్ ఆడుతుంటే వృద్ధాప్యంలో ఉన్నామనే ఆలోచనే మర్చిపోతాం. వృద్ధాప్యంలో వచ్చే సమస్యలను పంచుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నాం. మాలో చాలామంది పాటలు కూడా చాలా చక్కగా పాడుతూ నవ్విస్తుంటారు.

– జి. రవీందర్, రిటైర్డ్ టీచర్, నల్లగొండ

### బాధలు మర్చిపోయేలా..



విశ్రాంత జీవితాన్ని భారంగా ఉల్లాసంగా గడిపేలా.. పిల్లలు దూరంగా ఉన్న వారికి, జీవిత భాగస్వాములను కోల్పోయిన వారు బాధలు మర్చిపోయేలా కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం. రెండు నెలల క్రితం కోదాడలో రిటైర్డ్ ఉద్యోగులకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించాం.

– వేనేపల్లి శ్రీనివాసరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం కోదాడ పట్టణ అధ్యక్షుడు



కోదాడ: క్యారమ్స్ ఆడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

### సామూహిక జన్మదిన వేడుకలు



సామూహిక జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని పెన్షనర్ల భవన్‌లో మే నెలలో జన్మించిన రిటైర్డ్ ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టినరోజు జరుపుకున్న రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతరామయ్య, కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు, రఘువరప్రసాద్, విద్యాసాగర్, పొట్టా జగన్మోహన్‌రావు, అమృతారెడ్డి, వరప్రసాద్, భీక్షం పాల్గొన్నారు.

### అంతా కలిసికట్టుగా ఉంటాం



రిటైర్డ్ అయిన తర్వాత ఇంట్లోనే ఉంటే లేనిపోని ఆలోచనలతో అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. పది మందిమి ఒక చోట చేరి కష్టసుఖాలు పాలుపంచుకుంటే మనసు తేలికంగా ఉంటుంది. ఆపద సమయంలో మేమున్నామని ఒకరికి ఒకరం సహకారం అందించుకుంటూ కలిసికట్టుగా ఉంటాం.

– గజవెల్లి సత్యం, రిటైర్డ్ ఉద్యోగుల నల్లగొండ పట్టణ అధ్యక్షుడు

## పంతంగి టోల్‌ప్లాజాలో నిలిచిపోయిన వాహనాలు

- సాంకేతిక సమస్యతో అర్ధగంట పాటు పనిచేయని ఫాస్టాగ్ స్కానర్
- ఇరువైపులా కిలోమీటరు మేర ట్రాఫిక్ జాం



నిలిచిపోయిన వాహనాలు

చౌటుప్పల్ రూరల్: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజాలో సాంకేతిక సమస్యతో శనివారం ఉదయం అర్ధగంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. ఫాస్టాగ్ స్కానర్ పనిచేయకపోవడంతో టోల్‌ప్లాజాకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు టోల్‌ప్లాజా వద్దకు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. టోల్‌ప్లాజా సిబ్బంది వాహనాల నంబర్లను ఫొటో తీసుకుని వాహనాలను పంపించారు. పంతంగి టోల్‌ప్లాజాలో ఇప్పటికే సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసినప్పటికీ తరచూ సాంకేతిక సమస్య తలెత్తుతోంది. టోల్‌ప్లాజా సిబ్బంది సాంకేతిక సమస్య ఏర్పడినప్పుడు వాహనదారులతో గొడవకు దిగుతుండడంతో ఇబ్బందిగా ఉందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు స్పందించి టోల్‌ప్లాజాల వద్ద ఎలాంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వృద్ధురాలు అదృశ్యం



ఎల్లమ్మ

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు అదృశ్యమైంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం. యాద్గార్‌పల్లికి చెందిన అన్నపురి ఎల్లమ్మ(60) గత నెల 27వ తేదీ ఉదయం నుంచి కనబడట్లేదు. రెండు నెలలుగా ఎల్లమ్మకు మతిస్థిమితం సరిగా లేదని ఆమె కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఎంత వెతికినా ఎల్లమ్మ ఆచూకీ తెలియకపోవడంతో ఆమె మనుమడు అన్నపురి జయంత్ శనివారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మైసయ్య (ఫైల్)

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని గణేష్‌నగర్ కాలనీలో నివాసముంటున్న గుర్జి మైసయ్య(60) శుక్రవారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మైసయ్యకు కొంత కాలంగా ఆరోగ్యం సరిగా ఉండడంలేదు. కుటుంబ సభ్యులు అతడికి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స సైతం చేయిస్తున్నారు. అయినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో మనోవేదనకు గురవుతున్నాడు. హైదరాబాద్‌లో తన కుమారుడు శివకుమార్ వద్ద ఉంటున్న మైసయ్య శుక్రవారం చౌటుప్పల్‌కు వచ్చాడు. శివకుమార్ అదే రోజు తన తల్లి అండాలును తన వెంట హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న మైసయ్య శుక్రవారం రాత్రి దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గుర్తించి మైసయ్య కుమారుడికి సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## యాదగిరిగుట్ట క్షేత్రంలో భక్తుల రద్దీ



ఆలయ ముఖ మండపంలో స్వామివారి దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు



త్రితల ద్వారం నుంచి ప్రధానాలయంలోకి వెళ్తున్న భక్తులు

- స్వామివారిని దర్శించుకున్న 40వేల మందికి పైగా భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులు ముగుస్తుండటంతో స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధికంగా తరలివస్తున్నారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూకాంప్లెక్స్, ప్రసాద విక్రయశాల, మాడ వీధుల్లో భక్తులు అధికంగా కనిపించారు. స్వామివారి ధర్మ దర్శనానికి 3గంటలకు పైగా, వీఐపీ దర్శనానికి గంటకు పైగా సమయం పట్టిందని భక్తులు తెలిపారు. స్వామివారిని 40వేలకు పైగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిత్యాదాయం రూ.56,14,289 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

### గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల బారులు..

బీబీనగర్: వారాంతం కావడంతో బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద శనివారం వాహనాల రద్దీ నెలకొంది. హైదరాబాద్ నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి భారీగా తరలిరావడంతో వరంగల్ వెళ్లే వైపు వాహనాలు బారులుదీరాయి.



గూడూరు టోల్‌ప్లాజా వద్ద భువనగిరి వైపు నిలిచిన వాహనాలు

## మద్యం మత్తులో యువకుల వీరంగం

- మహిళపై దాడి
- పోలీసులపై కూడా తిరగబడ్డ యువకులు
- కేసు నమోదు చేసిన పోలీసులు

మునగాల: మద్యం మత్తులో ఆరుగురు యువకులు మహిళపై దాడి చేశారు. అంతేకాకుండా అడ్డుకోబోయిన పోలీసులపై తిరగబడి వారి విధులకు ఆటంకం కల్గించారు. ఈ ఘటన శనివారం మునగాల మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం నారాయణగూడెం గ్రామానికి చెందిన మామిడి ఎల్లయ్య మునగాల మండల కేంద్రానికి చెందిన చలమల త్రివేణిని మూడు నెలల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. దీంతో త్రివేణి సోదరుడి స్నేహితుడైన పిట్టల గోపి మూడు నెలల కిందట ఎల్లయ్య కుటుంబంతో ఘర్షణ పడ్డాడు. దీనిని మనసులో పెట్టుకుని శనివారం మామిడి ఎల్లయ్య తన స్నేహితులైన ఎలుగూరి గోపి, ఎలుగూరి గోపి, బండారు గోపాలకృష్ణ, మిట్టగణుపుల నవీన్, సిగ వీరబాబుతో కలిసి పిట్టల గోపి ఇంటి వద్దకు చేరుకొని వీరంగం సృష్టించారు. అడ్డుకోబోయిన గోపి తల్లి సీతరావమ్మను దూషించి ఆమెపై చేయి చేసుకోవడమే కాకుండా చంపుతామని బెదిరించారు. సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బంది శ్రీనివాసరావు, శ్రీకాంత్, బాలకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని యువకులను అడ్డుకునే ప్రయత్నం చేయగా.. మద్యం మత్తులో ఉన్న యువకులు పోలీసు సిబ్బందిపై తిరగబడి వారి విధులను ఆటంకం కల్గించారు. దీంతో కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## చెక్కు బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష

మిర్యాలగూడ టౌన్ : చెక్కు బౌన్స్ కేసులో వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.10లక్షల జరిమానా లేదా మరో ఏడాది జైలు శిక్ష విధిస్తూ మిర్యాలగూడ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పి. పవన్‌కుమార్ శనివారం తీర్పు వెలువరించారు. వివరాలు.. మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన సారెడ్డి సైదిరెడ్డికి అదే గ్రామానికి చెందిన ఇంద్రసేనారెడ్డి రూ.5లక్షలు ఇవ్వాల్సి ఉండగా.. 2021 డిసెంబరు 8న రెండు చెక్కులు ఇచ్చాడు. దీంతో సైదిరెడ్డి బ్యాంకుకు వెళ్లి చెక్కులను తన ఖాతాలో జమచేయాలని కోరగా ఇంద్రసేనారెడ్డి ఖాతాలో డబ్బులు లేవని బ్యాంకు సిబ్బంది చెక్కు వాపస్ ఇచ్చారు. దీంతో సైదిరెడ్డి న్యాయవాది ద్వారా కోర్టును ఆశ్రయించాడు. చెల్లని చెక్కులు ఇచ్చినట్లు నేరం రుజువు కావడంతో ఇంద్రసేనారెడ్డి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.10లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించకపోతే మరో ఏడాది జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.



## గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఎన్నిక



శ్రవణ్‌కుమార్, అధ్యక్షుడు

రామగిరి(నల్లగొండ): ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఎన్నికలు శనివారం నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎం. శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రుకోధర్, ఉపాధ్యక్షుడిగా వి. తారకేశ్వరి, సహాయ కార్యదర్శిగా వి. శ్యాంసుందర్‌రెడ్డి, శ్యాంసుందర్ ప్రసాద్, కోశాధికారి నిర్మలాదేవి, ప్రచార కార్యదర్శిగా కట్టా నాగయ్య, కార్యవర్గ సభ్యులుగా కుసుమశ్రీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో గ్రంథాలయాల పటిష్టతకు సహకారం అందిస్తామన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## మూసీ ప్రాజెక్టుకు జలకళ

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో జలకళ సంతరించుకుంది. పదిరోజుల నుంచి ఎగువన ఉన్న హైదరాబాద్ నగరంతో పాటు ఆలేరు, జనగామ తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద నీరు వస్తుండటంతో మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతోంది. శనివారం మూసీ ప్రాజెక్టుకు 874 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా.. శనివారం సాయంత్రానికి 639.50 అడుగులకు చేరుకుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో మరో ఐదు అడుగుల నీరు చేరితే గేట్లు పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేసే అవకాశముంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 3.10 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



వరద నీటితో కళకళలాడుతున్న మూసీ ప్రాజెక్టు

## కార్మికుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చలు

- విద్యుత్ ఉద్యోగుల సంఘం–327 రాష్ట్ర జనరల్ సెక్రటరీ శ్రీధర్



సంఘం జెండా ఆవిష్కరిస్తున్న శ్రీధర్

నల్లగొండ: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్స్, ప్రైవేట్ కలెక్షన్ ఏజెంట్లు, స్పాట్ బిల్లింగ్, స్టోర్ హమాలీ, వివిధ కార్మికుల సమస్యలపై త్వరలోనే ప్రభుత్వంతో చర్చలు జరపనున్నట్లు విద్యుత్ ఉద్యోగుల సంఘం–327 (ఐఎన్‌టీయూసీ అనుబంధం) రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ తెలిపారు. ఆ సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలో మే డే ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. అనంతరం హైదరాబాద్ రోడ్డులోని మీటింగ్ హాల్‌లో శ్రమశక్తి అవార్డు గ్రహీతలకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వంతో చర్చలు జరపడానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సమయం ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ అధ్యక్షుడు సురేష్ కుమార్, సంఘం జిల్లా అధ్యక్షుడు అమర్‌కుమార్‌రెడ్డి, ఎస్‌పీడీసీఎల్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్, నల్లగొండ డివిజన్ అధ్యక్షుడు కోమటిరెడ్డి సమిరెడ్డి, కార్యదర్శి పాండు, మిర్యాలగూడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్వరరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కుమార్తె వివాహం చేసిన మరుసటి రోజే..



కృష్ణవేణికి తలకొరివి పెట్టిన చిన్న కుమార్తె మనీషా



నలుగురు కుమార్తెలతో కృష్ణవేణి (ఫైల్)

- క్యాన్సర్‌తో పోరాడుతూ మహిళ మృతి

మర్రిగూడ: క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళ కుమార్తె వివాహం చేసిన మరుసటి రోజే మృతిచెందింది. ఈ ఘటన మర్రిగూడ మండలం లెంకలపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లెంకలపల్లి గ్రామానికి చెందిన గుండ్ల కృష్ణవేణి (40) భర్త పదేళ్ల క్రితమే మృతిచెందాడు. ఆమెకు నలుగురు కుమార్తెలు సంతానం. భర్త మృతిచెందినప్పటికీ కూలీ పనులు చేసుకుంటూ నలుగురు కుమార్తెలకు చదివించింది. ఈ క్రమంలోనే ఆమె క్యాన్సర్ బారిన పడింది. క్యాన్సర్‌తో పోరాడుతూనే ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోయినా కష్టపడి ఇద్దరు కుమార్తెల వివాహం కూడా చేసింది. శుక్రవారం మూడో కుమార్తె వివాహం చేసిన ఆమె.. క్యాన్సర్‌తో పోరాడుతూ శనివారం మృతిచెందింది. కుమార్తె వివాహం చేసిన మరుసటి రోజే కృష్ణవేణి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. ఆదర్శ పాఠశాలలో ఇటీవల పదో తరగతి పూర్తిచేసిన కృష్ణవేణి నాల్గో కుమార్తె మనీషా ఆమెకు తలకొరివి పెట్టింది. తన ఉన్నత చదువులకు సహకరించేదెవరని, తన బాధ్యతను ఎవరు చూసుకుంటారని మనీషా ఏడ్చిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. లెంకలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువజన నాయకుడు మేతరి శంకర్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ ఐతగోని రేణుకావెంకటయ్యగౌడ్ కృష్ణవేణి కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందచేశారు.